

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురంటౌన్: నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం పట్టణంలోని ఆరో వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలుకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రసాదరాజు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. సుమారు 21 గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ పాల్గొన్నారు.

పొమ్మనలేక పొగబెట్టినట్లు..!

- సవాలక్ష సమస్యలతో ఉపాధి కూలీలు ఉక్కిరిబిక్కిరి
- ఎన్‌ఎంఎంఎస్ యాప్‌తో తప్పని తలనొప్పులు
- పని ప్రదేశాల్లో సౌకర్యాలు నిల్
- మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్లు, సమ్మర్ అలవెన్స్‌కు మంగళం
- మున్సిపాల్టీ పరిధిలోకొచ్చిన గ్రామాల్లో కూలీలకు పనులు కరువు
- ఉపాధి హామీ పరిరక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం విశేష కృషి



మండుటెండలో పని చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - భీమవరం

వామపక్షాల పోరాట ఫలితంగా సాధించుకున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసే విధానాలను అవలంబిస్తోంది. ఉపాధి పనుల నిర్వహణకు బడ్జెట్‌లో కోతలు విధించి, పని దినాలు, వేతనాలు తగ్గించి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలుగా ఉన్న తాగునీరు, మజ్జిగ, టెంట్లు ఏర్పాటు, మెడికల్ కిట్లతోపాటు సమ్మర్ అలవెన్స్‌ను సైతం మంగళం పెట్టింది. ఇలా ఉపాధి కూలీ సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం, ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు, ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు ఉపాధి హామీ పనులు కొండంత అండగా ఉంటున్నాయి. నిత్యం ఎంతోమంది కూలీలు ఈ చట్టంపై ఆధారపడి పనులు చేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నారు. జిల్లాలోని గణపవరం మండలంతో కలుపుకుని 20 మండలాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 3,07,242 జాబ్‌కార్డులు ఉన్నాయి. దీనిలో సరాసరి 2,09,523 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. కరోనా కష్టకాలంలో ఉపాధి పనులు నిరుపేద కూలీలకు కడుపు నింపాయి. అన్ని వర్గాలవారు, పరిశ్రమలు మూతపడినప్పటికీ కూలీలకు పట్టెడన్నం పెట్టి ప్రాణాలు నిలిపింది. అయితే ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడ్జెట్ నిధులు తగ్గించడంతోపాటు కూలీలకు సవాలక్ష నిబంధనలు పెట్టి పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని మరింత బలహీన పరుస్తున్నాయి. 1990వ దశకం నుండి నయా ఉదారవాద ఆర్థిక విధానాలు రాకముందు వచ్చిన పశ్చిమగోదావరి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంలో నాట్లు దగ్గర నుండి కోతలు, కుప్ప నూర్పిళ్ల వంటి పనులన్నీ వ్యవసాయ కార్మికులే చేసేవారు. అయితే 1990 తర్వాత వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో కార్మికులకు పని దినాలు తగ్గాయి. వాణిజ్య పంటల పేరుతో ఆక్వా సాగు వచ్చిన తర్వాత వ్యవసాయ భూములన్నీ ఉప్పు కయ్యలుగా మారడంతో ఉపాధి కనుమరుగైంది. దానికితోడు రియల్ ఎస్టేట్ పేరుతో వ్యవసాయ భూములన్నీ ప్లాట్లుగా మారడంతో పనులులేక కార్మికుల వలసలు పెరిగిన పరిస్థితి ఉంది.

వామపక్షాల పోరాట ఫలితం

వ్యవసాయ కార్మికులకు పనులు లేని రోజుల్లో పనైనా చూపాలి.. తిండైనా పెట్టాలి అని 2000వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఎఫ్‌సిఐ గోడౌన్లను ముట్టడించారు. ఫలితంగా ఆనాడు పనికి ఆహార పథకం ప్రవేశపెట్టి ప్రభుత్వం అమలు చేసింది. ఈ పథకం ద్వారా పేదలందరికీ లబ్ధి చేకూరేలా ఉపాధి హామీ చట్టం కోసం వామపక్షాలు, ప్రజాసంఘాలు యుపిఎ-1 ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. ఫలితంగా 2005 ఫిబ్రవరి నుండి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చింది.

చట్టం నిర్వీర్యానికి కేంద్రంలోని బిజెపి యత్నం

కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి తీవ్ర ప్రయత్నం సాగిస్తోంది. వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిని కూలీలు చెప్పిన మాట వినడం లేదని, సోమరిపోతులు అయిపోయారని, పని చేయకుండానే డబ్బులు అప్పనంగా ఖాతాల్లో వేస్తున్నారని, రైతులు కంటే కూలీలు బతుకులే బాగున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుష్ప్రచారం చేశాయి. 2019-2020లో రూ.లక్షా 19 వేల కోట్లుగా ఉన్న బడ్జెట్‌ను ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.63 వేల కోట్లకు కుదించింది. అలాగే అనేక నిబంధనలను పెట్టి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తోంది.

కనీస సౌకర్యాలు, సమ్మర్ అలవెన్స్ నిల్

గతంలో 20 మంది కూలీలు ఒక గ్రూపుగా ఉంటే ప్రస్తుతం ఒక గ్రూపునకు 60 నుండి 70 మంది వరకు పెంచారు. వేసవిలో పని చేస్తున్న కూలీలకు గతంలో సమ్మర్ అలవెన్స్‌ను మే, జూన్ నెల్లలో 30 శాతం వరకూ ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం దీనిని కూడా ఇస్తున్న దాఖలాల్లేవు. ముఖ్యంగా పని ప్రదేశంలో టెంట్ ఏర్పాటు, మెడికల్ కిట్లు, మజ్జిగ, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించేవారు. ప్రస్తుతం అవేమీ కానరావట్లేదు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేడిమికి, ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో అనేక రోగాల బారిన పడుతున్నారు. కనీసం మెడికల్ కిట్లు కూడా అందుబాటులో లేకపోవడంతో కూలీల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఐదు కిలోమీటర్లు దాటి పనికెళ్తే ప్రయాణ ఛార్జీలు, సీనియర్ గ్రూపులకు పనిముట్లు వంటి అనేక సౌకర్యాలు తొలగించారు. చట్ట ప్రకారం మంజూరైన నిధుల్లో 60 శాతం లేబర్ కాంపోనెంట్ అంటే కూలీలకు ఖర్చు చేయాలి. మిగిలిన 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ అంటే అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని స్పష్టంగా ఉన్నా ఆ నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కుతున్నారు. ఇదిలాఉంటే మున్సిపాల్టీల్లో కలిపిన గ్రామాల్లో ఇప్పటికీ పనులు కల్పించిన పరిస్థితి ఎక్కడా కన్పించట్లేదు.

ఎన్‌ఎంఎంఎస్ యాప్‌తో తప్పని ఇబ్బందులు

నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) విధానాన్ని తీసుకొచ్చి కూలీలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గతంలో మేట్లకు మస్తర్ సీటుపై హాజరు వేసి కూలీల పని మస్తర్ వేసేవారు. నేడు ఎన్‌ఎంఎంఎస్ తీసుకొచ్చి గత మేట్ల స్థానంలో సైట్ సూపర్‌వైజర్‌గా పేరు మార్చి ఉదయం పని వద్ద స్మార్ట్‌ఫోన్ ద్వారా ఒక ఫొటో, మధ్యాహ్నం పని వద్ద మరో ఫొటో తీసి మస్తర్ వేసే విధానాన్ని తీసుకొచ్చింది. ఈ విధానం కూలీలకు శాపంగా మారింది. అయితే రెండు పూటలా పని పెంచినప్పటికీ దానికి తగ్గట్టుగా వేతనం మాత్రం పెంచిన పరిస్థితి లేదు. కేంద్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్ నుండి వేతనం రూ.15 పెంచినట్టుగా ప్రకటించినప్పటికీ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు బట్టి చూస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా కన్పిస్తోంది.

చట్టం పరిరక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం కృషి

పోరాట ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం విశేష కృషి చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొడుతూ కూలీలకు అండగా నిలుస్తున్నారు. చట్టం అమలులో చోటుచేసుకుంటున్న లోపాలను ఎత్తిచూపుతూ కూలీల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్నాయి. ఇటీవల కాలంలో జిల్లావ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం బృందాలు పర్యటించాయి. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి బృందాలు గ్రామస్థాయిలో కూలీల వద్దకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం పట్ల అవలంబిస్తున్న విధానాలను చాటి చెబుతూనే ఉన్నాయి. వారి సమస్యలను స్వయానా అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 12న జిల్లా కలెక్టరేట్ వద్ద వేలాది మంది కార్మికులతో ఎన్‌ఎంఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నేతలు ఉపాధి హామీ చట్టం పరిరక్షణ, కూలీల సమస్యల పరిష్కారం కోసం పర్యటనలు సాగిస్తున్నారు.

ఎండలు తట్టుకోలేకపోతున్నాం

కె.జ్యోతి, ఉపాధి కూలీ, పాలకోడేరు



ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. పని సమయంలో ఎండ తీవ్రత తట్టుకోలేకపోతున్నాను. కనీసం చెట్ల నీడ కూడా ఉండటం లేదు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నాను. గతంలో టెంట్లు ఉండేవి. ప్రస్తుతం అవేమీ లేవు. అడిగినా ఎవరు సమాధానం చెప్పట్లేదు.

ఎవరూ పట్టించుకోవట్లేదు


ఎన్.చిట్టిరత్నం, ఉపాధి కూలీ, పాలకోడేరు



పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించట్లేదు. కనీసం తాగునీరు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. గతంలో మజ్జిగ అందించేవారు. టెంట్‌లు ఏర్పాటు చేసేవారు. మెడికల్ కిట్లు కూడా అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అవేమీ లేవు. అడుగుతున్నా పట్టించుకోవట్లేదు. దిక్కుతోచని స్థితిలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం.

ఆన్‌లైన్ మస్తర్ విధానాన్ని రద్దు చేయాలి

జక్కంశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, భీమవరం



ఉపాధి కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.600 అందించాలి. వ్యవసాయ పని దినాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఈ పరిస్థితుల్లో వంద రోజుల నుండి 200 రోజులకు పని దినాలు పెంచాలి. సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలి. తొలగించిన సౌకర్యాలు అన్నింటినీ వెంటనే పునరుద్ధరించాలి. ఆన్‌లైన్ మస్తర్ విధానాన్ని రద్దు చేయాలి. మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలి. పని ప్రాంతంలో గాయాలు పాలైతే ప్రభుత్వమే వైద్యం చేయించాలి. ప్రాణాలు కోల్పోతే కుటుంబానికి అందించాలి. కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి.

విద్యుత్ కోతలను నిరసిస్తూ

సబ్‌స్టేషన్ వద్ద ఎంఎల్‌ఎ నిమ్మల ఆందోళన



సబ్‌స్టేషన్ వద్ద నిద్రకు సిద్ధమైన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పాలకొల్లు

అప్రకటిత కరెంటు కోతలకు నిరసనగా పాలకొల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు లాంతరు పట్టుకుని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కరెంటు కోతలు, ఛార్జీల భారం లేదని చెప్పారు. ప్రస్తుతం కరెంటు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెలియడం లేదన్నారు. ఇంట్లో పడుకుంటే ఉక్కపోత, బయట పడుకుంటే దోమల మోతగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు అంటూ వినియోగదారుడిపై భారం మోపడం తప్ప నాణ్యమైన కరెంటు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం ఇదని అన్నారు. రూ.29 వేల కోట్ల కుంభకోణంతో రాష్ట్రంలో స్మార్ట్‌మీటర్ల కుంభకోణానికి శ్రీకారం చుట్టడంతోపాటు భవిష్యత్తులో ముందుగానే అడ్వాన్స్‌గా కరెంట్ బిల్లులు కట్టే పరిస్థితిని జగన్ ప్రభుత్వం తీసుకొస్తుందని జోస్యం చెప్పారు.

అప్రకటిత విద్యుత్ కోతలను అరికట్టాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన



నినదిస్తున్న నేతలు, ప్రజలు

ప్రజాశక్తి - ఉండి

అప్రకటిత విద్యుత్ కోతలను అరికట్టాలని సిపిఎం మండల కమిటీ సభ్యుడు మాదాసి గోపీ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పాందువ్వ గ్రామంలో విద్యుత్ కోతలకు నిరసనగా గ్రామస్తులతో కలిసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు ఎటువంటి సమాచారం లేకుండా ఉదయం, రాత్రి వేళల్లో విపరీతంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే మండుటెండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరోపక్క విద్యుత్ అధికారులు వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు విధించడం సరికాదన్నారు. ఒకపక్క ఉక్కబోత, మరోపక్క దోమల విజృంభణతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పరిశ్రమలకు, ఆక్వా చెరువులకు నిరంతరం విద్యుత్ అందిస్తున్న విద్యుత్ అధికారులు ప్రజల ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయలేకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు విధించకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు పి.సుబ్రహ్మణ్యం, సిహెచ్.చిట్టిబాబు, ఎం.వెంకటేశ్వరరావు, గ్రామస్తులు ఎస్.బాలాజీ, ఎస్.రాజేష్, సిహెచ్.చిన్న, జి.సుబ్రహ్మణ్యం, ఎస్.రాంబాబు, ఎం.మహీధర్, ఎస్.వెంకట్‌కుమార్, బి.రాంబాబు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలి



చిత్రపటాన్ని దహనం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - తణుకురూరల్

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ఎంపీ చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షులుగా ఉన్న బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. దేశానికి క్రీడల ద్వారా ఎంతో పేరు తెచ్చిన వారికి ఇదేనా ఇచ్చే గౌరవం అని విమర్శించారు. గత 25 రోజులుగా ఢిల్లీ నడిబొడ్డున ఆందోళన సాగిస్తున్న క్రీడాకారులకు న్యాయం చేయకపోగా మోడీ ప్రభుత్వం వారిపై సాగిస్తున్న జులుం హేయమన్నారు. కర్ణాటక ఎన్నికల కోసం ఎన్నోసార్లు వచ్చిన మోడీ ఢిల్లీలో ఉన్న క్రీడాకారుల దగ్గరకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. క్రీడాకారులకు న్యాయం జరిగే వరకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కామన మునిస్వామి, మండల అధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, అయ్యప్ప, ఎన్.అనంతలక్ష్మి, నేలపాటి మరియన్న, యు.వెంకటేష్, ఎం.వెంకటేశ్వరరావు, టి.దుర్గ, పి.దక్షిణామూర్తి, బి.శ్రీహరి పాల్గొన్నారు.

22న మినీ మహానాడును విజయవంతం చేయాలి : ఎంఎల్‌ఎ రామరాజు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంఎల్‌ఎ రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఎన్‌టిఆర్ శతజయంత్యుత్సవాల్లో భాగంగా పెదఅమిరంలో ఈ నెల 22న నిర్వహించనున్న మినీ మహానాడు సభను విజయవంతం చేయాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పిలుపునిచ్చారు. పెదఅమిరం లిబర్టీ ఫ్యాక్టరీకి ఎదురుగా ఉన్న స్థలంలో సాగుతున్న మినీ మహానాడు ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామరాజు మాట్లాడుతూ మినీ మహానాడు సభకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, జోన్-2 ఇన్‌ఛార్జి ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరానున్నారన్నారు. ఎంఎల్‌ఎ వెంట టిడిపి నాయకులు ముదుండి రాజేష్‌వర్మ, వెంకట నరసింహరాజు, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు దొంగ కృష్ణ పాల్గొన్నారు.

నిరుపేద రైతు కుటుంబాలకు పరిహారం అందించాలి

- లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం
- భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ స్పష్టం
- పాలకోడేరు జగనన్న లేఔట్ భూనిర్వాసితులతో పాదయాత్ర



పాదయాత్రలో ఆందోళన నిర్వహిస్తున్న రైతులు, ప్రజలు

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన నిరుపేద కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ స్పష్టం చేసింది. మాది పేదల ప్రభుత్వమని ప్రగల్భాలు పలుకుతున్న వైసిపి రైతుల నోట్లో మట్టి కొట్టేలా వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించింది. నష్టపరిహారం అందించకుండా రైతు కుటుంబాలను చిన్నాభిన్నం చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేసింది. పాలకోడేరు కోటిగట్టు జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన నిరుపేద రైతు కుటుంబాలకు పరిహారం అందించాలని కోరుతూ భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాదయాత్ర చేపట్టారు. పాలకోడేరు-కుముదవల్లి రోడ్డు నుంచి చేపట్టిన ఈ పాదయాత్రను సీనియర్ రైతు గొట్టుముక్కల సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఈ యాత్రలో సిపిఎం, జనసేన, టిడిపితోపాటు వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, కెవిపిఎస్ నేతలు, నాయకులు, గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొని పాలకోడేరు రావిచెట్టు సెంటర్ మీదుగా పురానాదిమ్మ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు సాగింది. పాదయాత్రలో బాధిత కుటుంబ సభ్యులు, చిన్నారులు ప్ల కార్డులు పట్టుకుని బైఠాయించి నిరసన తెలిపారు. నష్టపరిహారం తక్షణం అందించాలని, లేక భూములు తిరిగివ్వాలని, ప్రభుత్వం, అధికారులు మోసం చేశారని, న్యాయం చేయకపోతే చూస్తూ ఊరుకోబోమని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే నిరుపేదల దగ్గర నుంచి భూములు తీసుకుని నష్టపరిహారం అందించకపోవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పేద రైతుల ఆధీనంలో ఉన్న భూములకు ఎకరాకు రూ.66 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పి మోసగించడం దారుణమన్నారు. జిల్లాలో అనేకచోట్ల భూస్వాముల చేతుల్లో వేలాది ఎకరాలు అసైన్డ్ భూములున్నాయని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉంటే వారి నుంచి ఆ భూములు స్వాధీనం చేసుకోవాలన్నారు. జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ నిరుపేద రైతు కుటుంబాల నుంచి జగనన్న ఇళ్ల స్థలాలకు భూములు తీసుకుని నష్టపరిహారం చెల్లించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 1976లో ల్యాండ్ సీలింగ్ అమల్లోకి వచ్చిందని, 1996 నుంచి ఇక్కడ రైతులు ఆ భూములు కొనుగోలు చేసి పన్నులు కట్టి పంట రుణాలు తీసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు అశ్రియ్య, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, జనసేన మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాదం నానాజీ, సవరం సత్యకృష్ణ మాట్లాడారు. నిరుపేద రైతు కుటుంబాలకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో తాము బాధితులకు అండగా ఉండి సమస్య పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. ఈ యాత్రలో జనసేన నాయకులు పి.దేవదాసు, శివకృష్ణ, ఆకుల సత్యనారాయణ, రావూరి సునీత, చేబోలు సత్యనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి వైఎస్ఎన్.మూర్తి, టిడిపి నాయకులు మాజీ సర్పంచి సత్యనారాయణ, గుల్లేపల్లి సత్యనారాయణ, మూర్తి నందన, మాధవ, కిరణ్, బాధితులు సాయిబాబు, సారంకి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మహత్యే శరణ్యం

నల్లి రామలక్ష్మి బాధితురాలు

భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేసుకుంటూ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నినాదాలు చేస్తున్న సమయంలో ఎస్ఐ నాలం శ్రీనివాస్ కమిటీ నేతలతో మాట్లాడారు. పాదయాత్ర చేయడం సరైనది కాదని, సమస్య తహశీల్దార్‌తో చెప్పాలని సూచించారు. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ సమస్యను ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహశీల్దార్ వద్దకు రావాలని ఎస్ఐ కోరారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎస్ఐ శ్రీనివాస్, ఆర్ఐ నాగభూషణంరావుతో భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ సమావేశమై సమస్యపై చర్చించింది. నిరుపేద రైతు కుటుంబాలకు అంతా అండగా ఉండాల్సిన అవసరం ఉందని, వారికి నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. 'మా కుటుంబాలకు మీరే న్యాయం చేయాలని బాధితురాలు నల్లి రామలక్ష్మి చేతులు జోడించి తహశీల్దార్‌ను వేడుకుంది. న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని, తనకు వేరే దారి లేదని స్పష్టం చేసింది. తన భర్త మనోవేదనకు గురై చనిపోయాడని కన్నీరుమున్నీరైంది. దీనిపై స్పందించిన తహశీల్దార్ షేక్ హుస్సేన్ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ప్రజల దాహార్తిని తీర్చేవే చలివేంద్రాలు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్



చలివేంద్రం ప్రారంభిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండి రూరల్ బ్యాంక్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ రోజురోజుకీ పెరిగిపోతున్న వేసవి తాపం నుండి ఉపశమనం పొందేందుకు ఉండి రూరల్ బ్యాంక్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రతిఒక్కరూ ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు తాగునీరు, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ బ్యాంక్ ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు, సభ్యులు చిట్టూరి రత్నరాజు, కరిమెరక శివనాగరాజు, ఉండి ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, వైసిపి మండలాధ్యక్షుడు పెన్మెత్స ఆంజనేయరాజు, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు దాసరి వెంకటకృష్ణ, రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు కరిమెరక మల్లికార్జున, బడుగు బాలాజీ, అంగర రాంబాబు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి

- రిటైర్డ్ డిఇఒ ప్రసాద్‌రాజు
- జెవివి ఆధ్వర్యాన విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ప్రజాశక్తి - భీమవరం

ప్రతి విద్యార్థీ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని రిటైర్డ్ డిఇఒ ఇందుకూరి ప్రసాద్‌రాజు అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఈ నెల 5 నుండి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి వినోదం సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు గురువారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు సర్టిఫికెట్లు, డ్రాయింగ్ బుక్స్, స్కెచెస్ సెట్స్, బహుమతులు అందజేసి మాట్లాడారు. సమయం వృథా చేయకుండా ప్రతిక్షణం ఏదోక కొత్త విషయాన్ని విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి వినోదం వంటి శిబిరాలు పిల్లల్లో ప్రేరణ కలిగిస్తాయన్నారు. పిల్లలు మూఢ నమ్మకాలు వదిలి ఆత్మస్థయిర్యంతో పెరిగేలా చేస్తాయని తెలిపారు. జెవివి నాయకులు జి.సుకుమార్ మాట్లాడుతూ ఈ వేసవి వినోదంలో నేర్చుకున్న అంశాలు మీమీ పాఠశాలల్లో ప్రదర్శించి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. అనంతరం రమేష్‌బాబు మేజిక్ ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లో డిఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఉండి

ఉండి పోలీస్ స్టేషన్‌ను భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను పరిశీలిస్తామని, దీనిలో భాగంగానే ఉండి పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగిందని తెలిపారు. పోలీస్ స్టేషన్ లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉందన్నారు. సిబ్బంది కొరతను ఎప్పుడు పూర్తి చేస్తారని అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఉండిలోనే కాకుండా తమ ప్రాంతంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత ఉందని, త్వరలో పరిష్కారానికి దిశగా కృషి చేస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.గంగాధర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 19వ తేదీన పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిడదవోలు ఎలక్ట్రికల్ ఇఇ బి.వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలం పరిధిలోని మార్టేరు, ఆలమూరు, పెనుమంట్ర 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో చెట్ల కటింగ్, సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరాకు ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకూ అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - గణపవరం

మానవత ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని తహశీల్దార్ పమ్మి లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మసీదు సెంటర్ వద్ద మానవత ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మానవత ప్రజలకు అనేక సేవలందిస్తోందన్నారు. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి వైసిపి మండల నాయకులు కొల్లి శ్రీను సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మానవత డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షులు వంకాయల రామారావు, జిల్లా కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరావు, నాయకులు పాల్గొన్నారు.

పోడూరు : వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేలా జిన్నూరులో భూపయ్య చెరువు సమీపంలో ప్రధాన రహదారి వద్ద గురువారం జనసేన ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలి వేంద్రాన్ని జనసేన నాయకులు కిరణ్, రామ్‌ప్రసాద్, మాల్లుల నాగరాజు, ఇళ్ల జనార్ధన్‌రావు, తారక రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

లక్ష్యం మేరకు విద్య అభ్యసించాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు లక్ష్యం మేర విద్యనభ్యసించాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులను స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఎంఎల్‌ఎ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యలో గాని, ఇతర అంశాల్లో గాని ఉన్నత శిఖరాలు అధిరోహించినపుడు ఎంతో ఆనందపడతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య కోసం వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తును కల్పించే దిశగా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, రేపూరి గోగురాజు, ఫులపర్తి శ్రీనివాస్, గంటా శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వైఎస్‌ఆర్ బీమా పేదల పాలిట ధీమా'

ప్రజాశక్తి - ఆచంట

వైఎస్ఆర్ బీమా పేదల పాలిట ధీమా అని ఎంఎల్ఎ చెరుకువాడ రంగనాథరాజు అన్నారు. కొడమంచిలి పంచాయతీ పరిధి టి.మెరక చెందిన ఐజెటి సుధాకర్ (35) ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వపరంగా వైఎస్ఆర్ బీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును మృతుని తండ్రి ఇంజేటి ప్రసాదీకు రంగరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు కొండంత అండగా వైఎస్ఆర్ బీమా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, ఉప సర్పంచి ములగాడ వరప్రసాద్, దేవస్థానం చైర్మన్ బాలా నాగు నరేష్, రైతు సంఘ అధ్యక్షులు మన్నె సుబ్బారావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

ఆచంట: రైతుల సంక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేసిన ఏకైక నేత సిఎం జగన్ ఒక్కరే అని వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి చంద్రమౌళిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పడుతున్న ఇబ్బందులను గుర్తించి సుమారు 4 లక్షల గోనె సంచులను కనుగొలు చేసి రైతులకు అందించిన రైతు పక్షపాతి ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు అని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం స్పందించి నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎఒలతో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రతి రైస్ మిల్లర్ నేరుగా మాట్లాడి ధాన్యం రైస్ మిల్లుకు పంపించే ఏర్పాటు చేశారని తెలిపారు. టిడిపి నాయకులు కేవలం రాజకీయంగా ఎదుర్కోలేక రైతులను తప్పు దోవపట్టించే విధంగా వారి మనోభావాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పోడూరు జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, పెనుగొండ ఎంపిపి పి.వెంకటేశ్వరరావు, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, వేణు మాధవ రెడ్డి పాల్గొన్నారు.

కూలీలకు ఒఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

పాలకోడేరు : వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. గొరగనమూడి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఎన్‌ఆర్‌ఇజిఎస్ కూలీల వద్దకెళ్లి వడదెబ్బ వల్ల కలిగే ఇబ్బందులపై, ఒఆర్‌ఎస్ ప్యాకెట్ల ప్రాముఖ్యతపై వైద్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పి రమోల, మగ ఆరోగ్య సహాయకుడు ఎం.విజయ ప్రసాద్, ఎఎన్‌ఎం వేదకుమారి, ఆశా వర్కర్లు శాంతి, కుమారి అవగాహన కల్పించారు. అనంతరం ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందించారు.ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.

వడగాల్పులకు వ్యక్తి మృతి

మొగల్తూరు: వడగాల్పులకు స్పృహ తప్పి పడిపోయిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వీరబాబు గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 16వ తేదీ మంగళవారం మండలంలోని కొత్తట గ్రామంలో సుమారు 40 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి వడగాల్పులకు స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు అతనిని నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గురువారం ఎస్ఐ తెలిపారు. అతని ఆచూకీ తెలిసినవారు తమకు సమాచారం అందించాలని కోరారు.



తాడేపల్లిగూడెం: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నేతలు బాబూరావు, సోమరాజు



ఆచంట: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జెక్కంశెట్టి సత్యనారాయణ


ఉండి: ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సిఐటియు నేత ఆంజనేయులు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నందమూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం తలెత్తిన మస్టర్ లోపాలను సరిచేసి కూలీలందరికీ పనులు కల్పించడం హర్షణీయమన్నారు. అందరికీ పనులు కల్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సోమరాజు అన్నారు. నందమూరులో పనులు ఆలస్యంగా మొదలుపెట్టినందుకు గాను కూలీలకు ఎక్కువ రోజులు పనులు కల్పించాలన్నారు. రూ.600 వేతనం, 200 రోజులు పని దినాలు అమలు చేయాలని, రెండు పూటలా మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.శ్రీనివాస్, కొప్పిశెట్టి హరికృష్ణ, ఎ.సత్యనారాయణ, రెడ్డి నాగరాజు, వీరెల్లి పోతురాజు, ఎ.అప్పారావు, పర్వతం గణపతి, వి.పోచమ్మ పాల్గొన్నారు.

అత్తిలి: ఉపాధి హామీలో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. ఈడూరులో పని ప్రదేశంలో ఉపాధి కూలీలను కలుసుకుని వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేతా గోపాలన్ మాట్లాడుతూ కార్మికుల్లో ఎక్కువ మంది వృద్ధులు ఉన్నారని, ఒకటి నుంచి రెండు కిలోమీటర్లు నడిచి వెళుతున్నారని తెలిపారు. ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉందని, పని ప్రదేశాల్లో తాగునీరు లేక కూలీలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రెండు పూటలా మస్తరు విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరుణ, బొట్టా అప్పన్న, సిపిఎం గ్రామం నాయకులు పాల్గొన్నారు.


అత్తిలి: ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న కేతా గోపాలన్

ఉండి : మండుటెండ, వడగాల్పులను తట్టుకొని వ్యవసాయ కార్మికులు పనిచేస్తుంటే మజ్జిగ, తాగునీరు, టెంట్లు వంటి సదుపాయాలు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల ఉసురు తీస్తున్నాయని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం యండగండి గ్రామంలో ఉపాధి పనుల ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో మజ్జిగ, తాగునీరు, టెంట్లు వంటి సదుపాయాలను కుదించిన ప్రభుత్వం మస్టర్ విధానాన్ని, పేస్లిప్పుల విధానాన్ని తొలగించిందని తెలిపారు. ఉపాధి కార్మికులు తాము ఎన్ని రోజులు పని చేశామని చెప్పుకోవడానికి ఆధారం లేకుండా చేశారన్నారు. ఇంటి దగ్గర ఉదయాన్నే వచ్చే పంచాయతీ కుళాయి నీళ్లు పట్టుకోవడానికి అవకాశం లేకుండా పోతోందన్నారు. జిల్లా అధికారులు చట్టంలో ఉన్న విషయాలను పట్టించుకుని ఉపాధి కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆచంట : ఉపాధి హామీలో పని ప్రాంతంలో ఆన్‌లైన్ ఫొటో, మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, మజ్జిగ, నీరు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఎ.వేమవరం శివారు పడమరపాలెంలో ఉపాధి కూలీల పని ప్రాంతంలో కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పెరిగిన ఉష్ణోగ్రతకు తగినట్టుగా పని ప్రాంతంలో టెంట్లు, సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండేటి సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరరావు, కడలి రాజేశ్వరి, కడలి భాగ్యలక్ష్మి, కడలి పెద్దింట్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఉపాధి హామీని నిర్వీర్యం చేసే విధంగా బిజెపి వ్యవహరిస్తోందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు అన్నారు. నత్తారామేశ్వరంలో ఉపాధి హామీ పనులను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గతంలో కంటే 33 శాతం బడ్జెట్లో కోత విధించిందన్నారు. ఈ బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ప్రస్తుతం జాబ్ కార్డులు కూడా ఉనికిలో లేవని ఆవేదన వ్యక్తం చేశారు .రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, ఫొటో ద్వారా మస్టర్ విధానాన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త సత్యనారాయణ, కంతేటి సత్యనారాయణ, చవాకుల భీముడు, చీలి అన్నమ్మ, దాసరి లక్ష్మి, చవ్వాకుల సునంద పాల్గొన్నారు.

ప్రయివేటు విద్యాసంస్థలు వార్షిక ఆడిట్ నివేదిక పక్కాగా సమర్పించాలి

నరసాపురం టౌన్ : ప్రయివేటు విద్యా సంస్థలు వార్షిక ఆడిట్ నివేదికను పక్కాగా సమర్పించాలని సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ తెలిపారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ప్రయివేటు విద్యాసంస్థల వార్షిక ఆడిట్ నివేదికపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నివేదికను సమర్పించలేని పక్షంలో వారిపై ప్రభుత్వ పరంగా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పాఠశాలల ఆదాయ, వనరులు వివరాలను సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారికి విధిగా అందజేయాలన్నారు. పాఠశాలల నిర్వహణ ఆదాయ వనరుల్లో 50 శాతం నిర్వహణకు, 15 శాతం సంస్థ సిబ్బందికి, 15 శాతం మెయింటినెన్స్‌కు వినియోగించాల్సి ఉంటుందన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వం నిర్దేశించిన నియ నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేయాలన్నారు. ప్రయివేటు విద్యా సంస్థలకు ఇందుకు సంబంధించి నోటీసులను త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రయివేటు విద్యాసంస్థలు పేద విద్యార్థులు చేర్పించుకోకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. 500 మంది చదువుతున్న విద్యాసంస్థల్లో ఆటస్థలం కోసం 30 సెంట్లు, వెయ్యి మంది చదువుతున్న సంస్థల్లో 50 సెంట్లు స్థలం కచ్చితంగా కేటాయించాలని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ వార్షిక ఆడిట్ గతం నుండి ఉందని దాన్ని పక్కాగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరిగా అమలు చేస్తున్నదీ లేనిది ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు.

విలువలతో కూడిన విద్య అభ్యసించాలి

మొగల్తూరు: విలువలతో కూడిన విద్యనభ్యసించాలని విద్యార్థులకు చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. గురువారం ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నరసాపురం నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ముదునూరి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రతి విద్యార్థీ ఏదో రంగం ఎన్నుకుని కష్టపడి పనిచేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పుల వల్ల తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉన్న బంధాలు దూరం అవుతున్నాయన్నారు. తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన వీర సీతారామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణమూర్తిని, వారి కుటుంబాన్ని, సహజ ఆనంద్ యోగా నిర్వాహకులు ఆచార్య రమేష్ గురూజీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి.శ్రీవెంకట రమణ, అందే బుజంగరావు, దొంగ మురళీకృష్ణ, బర్రె.సీతారామరాజు, కృష్ణమూర్తి, దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉండి : విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పెనుమార్పుల కారణంగా ప్రభుత్వ పాఠశాలలకు పునర్వైభవం వస్తుందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇటీవల పదిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను పివిఎల్ నరసింహరాజు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఎన్‌ఆర్‌పి అగ్రహారం ఎంపిటిసి మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఇవిఎం మిషన్ల భద్రతకు గోదాముల పరిశీలన

భీమవరం రూరల్: ఇవిఎం మిషన్లు, వివి పాడ్స్ తదితర ఎన్నికల సామగ్రిని భద్రపర్చేందుకు అనువైన కేంద్రాల కోసం వీర హౌసింగ్ గోదాములను జిల్లా జాయింటు కలెక్టర్ గురువారం పరిశీలించారు. విద్యుత్, రహదారి, షట్టర్లు పటిష్టత తదితర సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అలాగే అనువైన భద్రతా గదులన్నింటినీ నిశితంగా జిల్లా జాయింటు కలెక్టరు రామ్ సుందర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ వై.రవికుమార్,వీరహౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉండి : జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఉండిలో గురువారం పర్యటించి వ్యవసాయ మార్కెట్ కమిటీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎం మిషన్లు, వివి పాడ్స్ తదితర ఎన్నికల సామగ్రిని భద్రపర్చేందుకు అణువుగా ఉన్న ఉండి అగ్రికల్చర్ మార్కెట్ గోదాములను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మౌలిక వసతులపై కార్యదర్శిని ఆరా తీశారు. ఆయన వెంట ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

నవభారతి ఆక్యుపంక్చర్ కౌన్సిల్ అధ్యక్షులుగా నరసింహరాజు

నరసాపురం: నరసాపురం పట్టణానికి చెందిన టిఎన్‌ఆర్ ఫిజియోథెరపీ అండ్ ఆక్యుపంక్చర్ వైద్యులు టి.నరసింహరాజు నవభారతి ఆక్యుపంక్చర్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల తమిళనాడు రాష్ట్రంలో జరిగిన ఆలిండియా కమిటీ నవభారతి ఆక్యుపంక్చర్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా నుంచి ఆక్యుపంక్చర్ వైద్యులు టి.నరసింహరాజు నియమితులయ్యారు. ఆల్ ఇండియన్ కమిటీ జనరల్ సెక్రటరీ లయన్ డాక్టర్ అబ్దుల్ అజీజ్, ఆల్ ఇండియన్ నవభారతి ఆక్యుపంక్చర్ కౌన్సిల్ అన్నామలై, యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పన్ అన్నాధురై, రాష్ట్ర జనరల్ సెక్రటరీ భువనేశ్వరి చేతుల మీదుగా నరసింహరాజును నియమించారు. నరసింహరాజు నర్సాపురం పరిసరాల ప్రాంతాల్లో టిఎన్‌ఆర్ ఫిజియోథెరపీ అండ్ ఆక్యుపంక్చర్ ద్వారా చాలా సేవా కార్యక్రమాలు చేశారు. నవభారతి ఆక్యుపంక్చర్ కౌన్సిల్ ద్వారా మరిన్న సేవా కార్యక్రమాలు చేస్తామని వైద్యులు తిరుమాని నరసింహరాజు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

పాలకొల్లు రూరల్: మండలం మైజెరుగుంటలో అంబేద్కర్ విగ్రహాన్ని జెడ్‌పి ఛైర్మన్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, శాసనసభ్యులు నిమ్మల రామానాయుడు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శాసనసభ్యులు నిమ్మల మాట్లాడారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేత

ఆచంట: పేదలకు ఇళ్ల పట్టాలు నిరంతర ప్రక్రియ అని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు అన్నారు. ఆచంట పంచాయతీ పరిధి పొర గ్రామంలో జగనన్న కాలనీకి సంబంధించి కోర్టు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాలను కోర్టు క్లియర్ కావడంతో తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో గురువారం ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేతుల మీదుగా పెండింగ్‌లో ఉన్న 118 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సొంతిల్లు పభుత్వ ధ్యేయమన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం అర్హులైన లబ్ధిదారులకు తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం వద్ద బస్తా రూ.250కే సిమెంటు బస్తాలను అందించే విధంగా తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి అద్దాల పెద్దిరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

పాలకోడేరు: పాలకోడేరు శాఖా గ్రంథాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోదం కార్యక్రమం మూడోరోజు గురువారం ప్రత్యేక పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పదం పెంచడంతోపాటు సామాజిక అంశాలపై అవగాహన, ఆట పాటలు, నీతి కథలో బోధిస్తున్నామని జెవివి జిల్లా కార్యదర్శి మల్లుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, మ్యాజిక్, ఆటలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు పాలా అపర్ణ కుమార్, చిత్రలేఖన ఉపాధ్యాయుడు జె.రత్నరమేష్‌బాబు, గాయకుడు చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

సాటివారిని ఆదుకోవడం అభినందనీయం : పివిఎల్

పాలకోడేరు : ముఖ్యమంత్రి జగన్ నెలకొల్పిన సచివాలయ, వాలంటరీ వ్యవస్థలో ఉద్యోగాలు పొందిన ఉద్యోగులకు సాటివారిని ఆదుకోవాలనే ఆలోచన రావడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. విస్సాకోడేరు గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై మరణించిన పాలూరు అన్వేష్ కుటుంబానికి గురువారం ఆర్థికసాయం అందజేశారు. సర్పంచి బొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా సిఐలు కలిపి సేకరించిన రూ.48 వేలను పివిఎల్ నరసింహరాజు చేతుల మీదుగా ప్రస్తుతం వాలంటరీగా పనిచేస్తున్న రమేష్ భార్య ధనలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది వాలంటీర్లు, డ్వాక్రా సిఎల దాతృత్వంతో రమేష్ కుటుంబానికి అండగా ఉండడం అభినందనీయమన్నారు. సర్పంచి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుదాఘాతనికి గురై రమేష్ దురదృష్టవశాత్తూ మరణించడం బాధాకరమన్నారు. రమేష్ భార్య ధనలక్ష్మికి పసి వయసు కలిగిన ముగ్గురు కుమార్తెలు ఉన్నారని పేర్కొన్నారు. రమేష్ కుటుంబానికి గ్రామస్తులంతా అండగా ఉంటామని చెప్పారు.విస్సాకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.లతా నాగశ్రీ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 567 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచినందుకు గాను గురువారం ఆమెను ఘనంగా సత్కరించారు. స్థానిక సచివాలయం వద్ద సర్పంచి బొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాస్ లతా నాగశ్రీని రెండేళ్లపాటు తిరుమల కళాశాలలో చదివిస్తానని సభలో ప్రకటించారు. పివిఎల్‌తో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగులు సర్పంచిని అభినందించారు. అలాగే పంచాయతీ మూడో వార్డు సభ్యులు కలిదిండి సత్యనారాయణ రాజు విద్యార్థిని లతా నాగశ్రీకి విద్యాభ్యాసానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన అఖిల, యోగ లక్ష్మీ ప్రసన్నకు రూ.2 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కందుల నాగరాజు, మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాసరాజు, అశోక్ బాబు, ఎంపిటిసి సభ్యులు బొల్లం గాంధీ పాల్గొన్నారు.


రమేష్ భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్, సర్పంచి శ్రీనివాస్